ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025



ప్రజాతీర్పు.. వెన్నుపోటా..?

వైసీపీ విధ్వంస పాలన నుంచి విముక్తి కాదా..? ఐదేళ్లలో ఒక్క పరిశ్రమనైనా తెచ్చారా..?



అనంతపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల తీరు గురివింద గింజ సామెతను తలపిస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేసేలా అదే రోజు వెన్నుపోటు దినం పేరిట నిరసన తెలపాలని వైసీపీ నిర్ణయించింది. దీనిపై కూటమి నేతల నుంచే కాదు.. మేధావి వర్గాలు, రాజకీయ విశ్లేషకులు, సామాన్య ప్రజానీకం నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత ఏడాది జూన్ 4న ప్రజలు ఏకపక్షంగా కూటమికి విజయాన్ని కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయబావుటా ఎగరవేశారు. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచారు. ఉమ్మడి జిల్లాలో ఇది చారిత్రాత్మక విజయం. గత ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కాగా, అదే నెల 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రజల తీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినం అని వైసీపీ అధిష్టానం అవమానిస్తోందని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమౌతోంది. ఉమ్మడి జిల్లాలో కూటమికి ఇంతటి చారిత్రాత్మక విజయం అందిన నేపథ్యంలో ఆత్మావలోకనం చేసుకోవాల్సిన వైసీపీ నేతలు.. ప్రజా తీర్పును హేళన చేసేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. అయినా వైసీపీ నేతల తీరులో మార్పు కనిపించడం లేదన్నభావన ఆ పార్టీ వర్గాల్లోనే వ్యక్తమౌతోంది.

సంక్షేమం కనిపించదా..?

బటన్ నొక్కుడుకే ఐదేళ్ల సమయం వెచ్చించారని, కరువు జిల్లా అభివృద్ధికి ఏ మేరకు చర్యలు తీసుకున్నారో చెప్పే పరిస్థితి ఉందా..? అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. హంద్రీనీవా విస్తరిస్తామని, హెచ్చెల్సీకి సమాంతర కాలువ తవ్వుతామని, ప్రతి ఎకరానికీ సాగునీరు ఇస్తామని పదేపదే హామీలు ఇవ్వడం తప్ప.. గంపెడు మట్టి తీయలేదన్నది వాస్తవం కాదా..? అని (మిగతా 6వ పేజీలో..)

వైసీపీ అహంకారానికి పరాకాష్ట

ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేసే విధంగా జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా పేర్కొనడం వైసీపీ నేతల అహంకారానికి పరాకాష్ట. వెన్నుపోటైనా.. గొడ్డలిపోటైనా... వైసీపీ నేతలకే చెల్లుతుంది. ఆ పేటెంట్ హక్కు వారిదే. ఐదేళ్ల విధ్వంసకర పాలనకు, చేసిన మోసాలకు ప్రజలు తీర్పు ఇచ్చిన రోజున వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు చేయడం దుర్మార్గం. ఆ రోజును వైసీపీ నేతలు పశ్చాతాప దినంగా నిర్వహించుకుంటే మంచిది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే హామీలను ఎక్కడా విస్మరించకుండా, ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో 15 శాతం హామీలు కూడా అమలు చేయలేదు. ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, కుంభకోణాల నేపథ్యంలో ఒక్కొక్కరుగా ఆ పార్టీ నేతలు జైళ్లకు వెళుతున్నారు. ఈ సంఘటనలను నుంచి ప్రజల దృష్టినిమరల్చేందుకే జగన్‌రెడ్డి కొత్త డ్రామాలకు తెరదీసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలు జగన్ డ్రామాలను గమనిస్తున్నారు.

-కొల్లకుంట అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



కూటమి విజయంతోనే పారిశ్రామికాభివృద్ధి వాస్తవం కాదా..?

సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేయడం లేదా..?

వైసీపీ నేతల తీరుపై కూటమి నేతలు, ప్రజల ఆగ్రహం

డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు

- ఓ వ్యవసాయ తోటలో నిల్వ
- 1500 లీటర్ల డీజిల్ పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు (7వ పేజీలో..)

ఫిట్‌లెస్..!

వారంరోజుల్లో పాఠశాలల ప్రారంభం

ఎఫ్‌సీ చేయించుకోని 76 బడి బస్సులు

పట్టించుకోని అధికారులు



బడిబస్సులు

పుట్టపర్తిరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మరో వారంరోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పిల్లలను యాజమాన్యాలు బస్సుల్లో తరలిస్తుంటాయి. ఉదయాన్నే ఇంటి నుంచి తీసుకెళ్లి, సాయంత్రం తిరిగి దిగబెడుతుంటాయి. బడికి బయల్దేరినప్పట్నుంచి విద్యార్థులు తిరిగి ఇంటికొచ్చేదాకా కుటుంబీకుల్లో ఒకటే టెన్షన్. క్షేమంగా రావాలని కోరుకుంటుంటారు. అలాంటి పిల్లలను తీసుకెళ్లే బస్సులను కండీషన్‌లో ఉంచుకోవాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యాలదే. బడులు తెరిచే సమయం దగ్గరపడుతున్నా.. జిల్లాలో ఇంకా 76 పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోలేదు. దీంతో వాటి కండీషన్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పాఠశాల బస్సులన్నింటికీ ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సిన బాధ్యతను సంబంధిత అధికారులు విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏటీఎస్‌లో పరీక్షలు

జిల్లాలో మొత్తం 512 పాఠశాల బస్సులు నడుస్తున్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటిలో ఇప్పటికే 436 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్నాయి. ఇంకా 76 పెండింగ్ ఉన్నాయని రవాణా శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. పాఠశాల వాహనాలను రవాణా శాఖాధికారులు పరీక్షించి, పూర్తి కండీషన్‌లో ఉన్నాయా, లేదా అనే విషయాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది. గతంలో స్కూల్ వాహనాలను రవాణా శాఖాధికారి కార్యాలయం వద్ద సాధారణ పద్ధతిలో పరిశీలించేవారు. వాహన ఫిట్‌నెస్, బీమా తదితరాలను పరిశీలించేవారు. అన్నీ సక్రమంగా ఉంటే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) ఇచ్చేవారు. ప్రస్తుతం ఆటోమేటెడ్ టెస్టింగ్ విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానంలోనే పరీక్షించి, సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. మానవ తప్పిదాలు, అక్రమాలకు తావులేకుండా దీనిని అమలు చేస్తున్నారు. బుక్కపట్నం సమీపాన ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్)ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడే బడి బస్సులను తనిఖీ చేయనున్నారు.

యంత్రాల సాయంతో తనిఖీలు

యంత్రాల సాయంతో వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తారు. వాహనం నుంచి వెలువడుతున్న పొగ మొదలుకుని బ్రేక్, లైట్స్ పనితీరును పరిశీలిస్తారు. ఏచిన్న లోపం ఉన్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీకాదు. కండీషన్‌లో ఉన్న వాహనాలను మాత్రమే ఏటీఎస్‌కు తీసుకురావాలి. పాఠశాల యాజమాన్యాలు ముందుగానే ఫిట్‌నెస్ పరీక్షకు చలానా తీయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి నిర్దిష్ట సమయం కేటాయించి ఏటీఎస్‌లో వాహనానికి చెందిన పూర్తి సమాచారం నిక్షిప్తం చేస్తారు.

పత్రాలు లేకుండా నడిపితే కేసులు

పాఠశాల బస్సులకు ఏటీఎస్ విధానంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. పిల్లల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తాం. డ్రైవర్లు సుశిక్షితులై, లైసెన్సు, తగిన అనుభవం ఉండాలి. అవసరమైన సర్టిఫికెట్లు లేకుండా వాహనాలు రోడ్డు మీదకు వస్తే కేసులు నమోదు చేసి, సీజ్ చేస్తాం.

- కరుణసాగర్‌రెడ్డి,
జిల్లా రవాణా శాఖాధికారి,
శ్రీసత్యసాయి జిల్లా



అటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్

నేడు మెము రైలు ప్రారంభం

అనంత నుంచి బెంగళూరుకు ప్రయాణం సులభతరం

(వివరాలు 7వ పేజీలో...)

ఏమాత్రం బాధ్యత లేకుండా..!



కదిరి నిజాంవలీకాలనీకి చెందిన ఓ మహిళలకు నెలసరి సమయంలో కడుపు నొప్పి రావడంతో ఉపశమనం కోసం పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని ఓమెడికల్ స్టోర్‌లో మాత్రలు కొనుగోలు చేశారు. మాత్రలు మింగిన ఐదారు గంటల తరువాత ఆమెకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి, ఆమె వాడిన మాత్రలు చూపించారు. అక్కడ వైద్య సిబ్బంది వాటిని పరిశీలించి, కాలం చెల్లినవిగా గుర్తించారు. కుటుంబ సభ్యులు మెడికల్ స్టోర్ యజమానిని నిలదీయగా, వైద్యానికి అయ్యే ఖర్చులు భరించినట్లు సమాచారం.

మందుల విక్రయాల్లో ఇష్టారాజ్యం

- వైద్యుల చీటీ లేకుండానే అమ్మకాలు
- షాపుల్లో కానరాని ఫార్మాసిస్టులు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- నామమాత్రంగా అధికారుల తనిఖీ

కదిరి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెడికల్ షాపు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా మాత్రలు అమ్మేస్తున్నారు. డాక్టర్ చీటీ లేకపోయినా ఆరోగ్య సమస్య చెబితే చాలు ఏమందులు వేసుకోవాలో, రోజుకు ఎన్ని వేసుకోవాలో, ఎన్నిరోజులు వాడాలో కూడా చెబుతున్నారు. వీరిచ్చే మందులతో తాత్కాలికంగా ఉపశమనం కలిగినా, దీర్ఘకాలంలో దుష్పరిణామాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మెడికల్ షాపులు నిర్వహించాలంటే..

డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్టు 1940, ఫార్మసీ యాక్టు 1948 ప్రకారం బీ ఫార్మసీ లేదా ఎం ఫార్మసీ పూర్తి చేసిన వారు మాత్రమే మెడికల్ షాపులు నిర్వహించాల్సి ఉంటుంది. షాపు అనుమతి తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపుకార్డులు, చిరునామా తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత అధికారుల నుంచి అనుమతులు మంజూరైన తరువాత షాపులు నిర్వహించాల్సి ఉంటుంది.

లైసెన్సు ఒకరిది, నిర్వహణ మరొకరిది

జిల్లాలో చాలా మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. నింబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. షాపులో కనీసం బి.ఫార్మసీ చేసిన వారే ఉంటూ మందులు ఇవ్వాలి. కానీ చాలవరకు అద్దె లైసెన్సులు తెచ్చుకుని, మెడికల్ దందా నిర్వహిస్తున్నవారే అధికంగా ఉన్నారు. సంబంధిత శాఖ అధికారుల అండదండలతోనే ఇదంతా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న క్లినిక్ నుంచి, నర్సింగ్ హోమ్ వరకు ఎవరికి వారే మెడిల్ షాపులు ఏర్పాటు చేసుకుని, కాస్త అనుభవమున్నవారి ద్వారా మందులమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీల ఇళ్లలో మెడికల్ షాపును తలపించేలా అన్నిరకాల మందులు ఉంటాయి.

అవసరంలేని మందులు

వివిధ మందుల కంపెనీల ప్రతినిధులు ఇచ్చే తాయిళాలకు ఆశ పడి రోగులకు అవసరం లేకున్నా మందులను అంటగడుతున్నారు. ఒకటి రెండు రకాల మందులతో నయమయ్యే రోగానికికూడా ఐదారు కంపెనీల (మిగతా 6లో..)

కదిరి అభివృద్ధికి రూ.577కోట్లు

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి మొదటి సంవత్సరం రూ.577 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తన నివాసంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.577 కోట్లతో అన్ని పనులు ప్రారంభించామన్నారు. రోడ్లు, కాలువలు, మున్సిపాలిటీలో వివిధ రకాల పనులు చేపట్టామన్నారు. అందులో భాగంగా ఉపాధి పథకం కింద గోకులం షెడ్లకోసం రూ.4.70 కోట్లు, పారిశ్రామిక వాడకోసం రూ.3.48 కోట్లు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ కోసం రూ.2.6 కోట్లు, సీఎస్‌ఆర్ నిధుల కింద రూ.కోటి, హంద్రీనీవా పనులకు రూ.254.50 కోట్లు, నీటిపారుదలకోసం రూ.1.14 కోట్లు, కదిరి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.55.15కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.6.5 కోట్లు, మండల పరిషత్‌లగ్రాంటు కింద రూ.4.6 కోట్లు, నాబార్డు నిధులు రూ.30.04 కోట్లు, జాతీయ రహదారుల కోసం రూ.119కోట్లు, పీఆర్ రోడ్లకోసం రూ.19.68కోట్లు, ఆర్అండ్‌బీ పరిధిలో రూ.32.9 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ రూ.26.53 కోట్లు, సమగ్రశిక్ష పరిధిలో రూ.18.79కోట్లు, జిల్లాపరిషత్ కింద రూ.2.30 కోట్లు కలిపి మొత్తం రూ.577 కోట్ల పనులు చేపట్టామన్నారు. వైసీపీ పాలనలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. జగన్‌రెడ్డి మోసపూరిత వాగ్దానాలిచ్చి, ప్రజలను మభ్యపెట్టారన్నారు. గత ఐదేళ్లలో ప్రజలకు ఎన్ని వెన్నుపోట్లు పొడిచారో చెప్పాలని నిలదీశారు. పోలీసుల డబ్బు నొక్కేసి, వారికి వెన్నుపోటు పొడవ లేదా అన్నారు. కులం, మతం పేరుతో కార్పొరేషన్ తెరచి, ఒక్క రూపాయి విడుదల చేయకుండా వెన్నుపోట పొడవలేదా అని ప్రశ్నించారు. వీటిన్నింటికీ సమాధానం చెప్పి వెన్నుపోటు కార్యక్రమం నిర్వహిస్తే బాగుటుందని కందికుంట హితవు పలికారు. సమావేశంలో నాయకులు డైమండ్ ఇర్ఫాన్, బాహుద్దీన్, కృష్ణమూర్తి, బాబయ్య, నాగేంద్ర, మోపూరిశెట్టి చంద్రశేఖర్, ఇలాహి, జిలాన్, అయూబ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- అధికారులకు ఎంపీ బీకే ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీ బీకే పార్థసారథి. అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం వివిధశాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో ఎంపీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో చేపట్టిన రోడ్లు, మంచినీటి పథకాలు, భవనాలు తదితర పనులపై ఆరాతీశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ మురళీమోహన్, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహమూర్తి, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ డీఈలు, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త

- రాబోయే మూడు నెలలు భారీ వర్షాలు కురిసే అవకాశం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్



7

బీఎస్ఎఫ్ జవాన్ మామకు

భూమి అప్పగింత

దగ్గరుండి సర్వే చేయించిన రెవెన్యూ అధికారులు (7లో..)

శిథిల సదనాలు..!

కసాపురం భక్తులకు వసతి తిప్పలు

శిథిలావస్థలో గదులు

పనిచేయని ఏసీలు

వీడని మాస్టర్‌ప్లాన్ పీటముడి



గదుల నిర్వహణ సరిగా లేని కేసరి సదనం



కసాపురం దేవస్థానం

గుంతకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు సరైన వసతి గదుల్లేక ఇక్కట్లు పడుతున్నారు. వేసవిలో ఏసీలు పనిచేయక అవస్థలు పడ్డారు. ఉన్న ఏసీ గదుల్లో ఎయిర్ కండిషన్ యంత్రాలు మూలనపడడంతో వాటిని నాన్ ఏసీ వసతి గదులుగా మార్చేశారు. దేవస్థానంలో తొమ్మిదేళ్ల కిందట నిర్మించిన ప్రాథమిక వసతి గదుల సముదాయం (పీఏసీ)లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దేవస్థానానికి భక్తులు ఇచ్చిన విరాళాల రిజర్వ్ నిధులు పుష్కలంగా ఉన్నా, మాస్టర్ ప్లాన్ లేదన్న కారణంగా ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలేదు. మంగళ, శనివారాల్లో ఆలయానికి నిద్ర చేయడానికి వచ్చే భక్తులు సరైన వసతి గదుల్లేక ప్రైవేటు లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు. ఇక నాన్ ఏసీ రూముల నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉంది. రూములు దుర్వాసన వెదజల్లుతుంటాయి. డబ్బులిచ్చి ఈ గదుల్లో నిద్రించేకంటే ఆలయ ఆవరణలో ఆరుబయట పడుకోవడమే ఉత్తమమని భక్తులు భావిస్తున్నారు.

రెండు ఏసీ రూములే గతి

కసాపురం దేవస్థానంలో టీడీపీ హయాంలో నిర్మించి ప్రారంభించిన పీఏసీలో భక్తుల సౌకర్యార్థం 16 ఏసీ గదులతో పాటు, నాలుగు సూట్ రూములు, డార్మెటరీలు, వివాహాది కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి హాళ్లను ఏర్పాటుచేశారు. ఆ కొత్త భవనంలో ఉన్న 16 ఏసీ గదుల్లో ఒక్క దాంట్లో మాత్రమే ఏసీ పనిచేస్తోంది. ఏసీలు పనిచేయని రూములను నాన్ ఏసీ కింద బుక్ చేస్తున్నారు. ఆలయ అన్నదాన సదనానికి అనుకుని ఉన్న నాలుగు ఏసీ సూట్‌లలో ఒకటి, ఒక స్పెషల్ గెస్ట్‌హౌస్‌లో మాత్రమే ఏసీలు నడుస్తున్నాయి. మిగతా వాటన్నింటినీ నాన్ ఏసీగా ట్రీట్ చేస్తున్నారు. దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే కార్యక్రమం ఓ ప్రహసనంగా మారింది. 15 ఏళ్ల నుంచీ కసాపురం దేవస్థానానికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే విషయంగా ప్రతిపాదనలు, హామీలు, కార్యాచరణలు చేపడుతున్నా ఏదీ కొలిక్కిరాలేదు. దీంతో దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమం చతికిలపడింది.

నిర్వహణ అధ్వానం

కసాపురం దేవస్థానంలో భక్తుల వసతి కోసం పీఏసీ సముదాయం కాకుండా కేసరి సదనంలో 30, రామ, లక్ష్మణ సదనాల్లో 30 గదులు అందుబాటులో ఉండేవి. రామ, లక్ష్మణ సదనం భవనాలు నిర్మించి చాలా సంవత్సరాలు గడవడంతో అవి పాతబడిపోయాయి. రామ సదనంలో పైఅంతస్తు పూర్తిగా శిథిలమైపోవడంతో తొలగించేశారు. ఈ 30 గదుల్లో ఐదింటిని మాత్రమే వినియోగిస్తున్నారు. మిగతావన్నీ అద్దెకిచ్చే స్థితిలో లేవు. కేసరి సదనంలో ఉన్న 30 గదుల్లో రెండింటిని స్టేట్ బ్యాంకు శాఖ కోసం ఇచ్చారు. మరమ్మతులు చేయాల్సి ఉందంటూ ఆరింటిని మూతేశారు. మిగిలిన గదులు కూడా దుర్వాసన వెదజల్లుతూ జుగుప్సాకరంగా ఉంటున్నాయని భక్తులు వాపోతున్నారు. కేసరి సదనంలో కొన్ని గదులకు ఐదేళ్ల కిందట మరమ్మతులు చేయగా, పైకప్పులు మరలా శిథిలమైపోయాయి. ఆలయంలో దాదాపు 70 మంది కాంట్రాక్టు, పర్మనెంటు కార్మికులున్నా.. రాజకీయాల నేపథ్యంలో వారితో సక్రమంగా పనిచేయించుకోలేని దుస్థితి దాపురించింది. ఈ కారణంగా గదుల నిర్వహణ అధ్వానంగా మారడం, ఏసీలు ఉన్నా పనిచేయకుండా పోవడం భక్తులకు శాపంగా మారింది. కాగా, పీఏసీలోని డార్మెటరీలను వసతి గదులుగా మార్చే యోచనలో అధికారులు ఉన్నట్టు సమాచారం.

పది రోజుల్లో ఏసీలను సిద్ధం చేస్తాం

కోతుల కారణంగా ఏసీ కనెక్షన్లు కట్ అయ్యాయి. వాటికి మరమ్మతులు చేయడానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందన రాలేదు. మెకానిక్‌ను పిలిపించి ఏసీలను సత్వరమే రిపేరీ చేయించి, వినియోగంలోకి తెస్తాం.

-వాణి, కసాపురం ఆలయ కార్యనిర్వాహణాధికారి

గదులను సక్రమంగా నిర్వహించాలి



శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఎంతో ప్రసిద్ధి. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, హనుమాన్ దీక్షాపరులకు సరైన వసతి గదులు అందుబాటులో లేవు. కొత్తగా నిర్మించిన పీఏసీలో కేవలం ఒక్క గదిలోనే ఏసీ పనిచేస్తోందంటే నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏ ఈఓ వచ్చినా ఇక్కడి సమస్యలు పరిష్కారం కావడంలేదు. వెంటనే కొత్త గదులను నిర్మించాల్సిన అవసరం ఉంది.

- ప్రసాదరెడ్డి, కసాపురం గ్రామస్థుడు

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఆలయానికి వచ్చి భక్తితో నిదురచేసి చేయాలనుకునే భక్తులకు సరైన వసతులు లేకుంటే నిరుత్సాహానికి లోనవుతారు. భక్తులు అసంతృప్తికి లోనుకాకుండా ఆలయం వద్ద కనీస సౌకర్యాలను కల్పించాలి. ఆ మేరకు వసతి గదులకు మరమ్మతులు చేయించి, సక్రమంగా నిర్వహించాలి.

- జగన్నాథ్, గుంతకల్లు

వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి



వేలాదిగా భక్తులు వచ్చే కసాపురం దేవస్థానంలో వసతి గదులను సక్రమంగా నిర్వహించకపోవడం శోచనీయం. భక్తులకు తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, హైజీనిక్‌గా టాయిలెట్ల నిర్వహణ చేపట్టకపోతే పరిపాలనా వ్యవస్థ విఫలమైనట్టే. ఆలయంలో ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా మాస్టర్ ప్లాన్ పెద్ద అడ్డంకిగా మారుతోంది. వెంటనే రాజకీయాలకు అతీతంగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధంచేయడానికి ప్రభుత్వం, అధికారులు కృషిచేయాలి.

-మంజుల వెంకటేశ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు, గుంతకల్లు

ఉచిత ఇసుక విధానంతో పేదలకు మేలు

జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానంతో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతోందని జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉచిత ఇసుక విధానం, జిల్లాలో మైనింగ్ తదితర విషయాలపై జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు పలు విషయాలు వివరించారు.

ప్రశ్న: ఉచిత ఇసుక విధానం జిల్లాలో ఎలా అమలవుతోంది ?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానం పటిష్టంగా, విజయవంతంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలకు మేలు కలిగేలా అమలు చేస్తున్నాం.

ప్రశ్న: ఇసుక అక్రమ రవాణాను ఎలా అరికడుతున్నారు...?

జవాబు: ఎవరైనా కమర్షియల్ పనుల కోసం ఇసుక రీచ్‌ల్లో తవ్వినా, అక్రమంగా అమ్మకానికి తరలించినా చర్యలు తప్పవు. ఫిర్యాదులు అందిన వెంటనే దాడి చేస్తున్నాం. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నాం. సొంత నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక విధానం వర్తిస్తుంది.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లు ఉన్నాయి...?

జవాబు: జిల్లాలో ప్రస్తుతం కణేకల్లు మండలం రచ్చుమర్రిలో మాత్రమే ఇసుక రీచ్ పనిచేస్తోంది. మొత్తం 60వేల టన్నుల ఇసుకకు అనుమతించగా..ఇప్పటి వరకు 20వేల టన్నుల ఇసుక తరలించారు. ఇక 40వేల టన్నులు ఇసుక అందుబాటులో ఉంది. ఇల్లూరు, కర్తనపల్లి, అజ్జయ్యదొడ్డిలలో ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇక పట్టాల్యాండ్‌లో ఇసుక తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తోంది. జిల్లాలో పట్టాభూముల్లో 7 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చారు. మరో 23 వాగు, వంకలు, ఏరులో ఇసుక తవ్వకానికి అనుమతిచ్చారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని మైనింగ్ లీజులున్నాయి...?

జవాబు: 127 ఉన్నాయి. ప్రస్తుతం 83మైనింగ్ లీజులు మాత్రమే పనిచేస్తున్నాయి.

ప్రశ్న: జిల్లాలో ఖనిజ తవ్వకాలు, లీజుల చెల్లింపులు ఎవరికి కడుతున్నారు...?

జవాబు: గత ప్రభుత్వంలో మైనింగ్ లీజుల రాయల్టీ అమిగోస్ సంస్థకు చెల్లించేవారు. ప్రస్తుతం ఆ సంస్థ గడువు ముగిసింది. అమిగోస్ సంస్థ ప్రభుత్వానికి రూ.60కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. కొత్త వారికి కాంట్రాక్ట్ ఇచ్చే వరకు లీజుదారులు ప్రభుత్వ ఖాతాలోకి రాయల్టీ కడుతున్నారు. అంతా ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుగుతాయి.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఈనెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో బాల, బాలికలకు 20 చొప్పున మొత్తం 40 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఐదో తరగతిలో కూడా అదే స్థాయిలో ఖాళీలున్నాయన్నారు. 4వతరగతిలో ప్రవేశాలకు 2015 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31వతేదీ మధ్య జన్మించి 8-10 సంవత్సరాల వయసుగల విద్యార్థులు అర్హులన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31వతేదీ మధ్య జన్మిచిన 9-11 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వేర్వేరు దశల్లో ఎంపిక పోటీలుంటాయన్నారు. జూలై 21 నుంచి 23తేదీ మధ్య ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారన్నారు. వివరాలకు 7989090758 నంబరులో సంప్రదించాలని కోరారు. apsportsschool.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ సూచించారు.

ప్రజాతీర్పు.. వెన్నుపోటా...?

(5వ పేజీ తరువాయి)

రైతాంగం ప్రశ్నిస్తోంది. ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చారా..? ఉపాధి కల్పించారా..? అని యువత ప్రశ్నిస్తోంది. పింఛన్ రూ.3 వేలు ఇస్తానని చెప్పి... ఏడాదికి రూ.250 పెంచి, చివరి సంవత్సరంలో రూ.3 వేలకు పెంచారని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి అధికారంలోకి రాగానే హామీ మేరకు మూడు నెలల అదనపు రూ.వెయ్యి కలుపుకుని ఒకేసారి రూ.7వేలు చెల్లించారని గుర్తు చేస్తున్నారు. పేదల కడుపునింపేందుకు రూ.5కు కడుపు నిండా భోజనం పెట్టే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించిన విషయం కనిపించడం లేదా..? అని ప్రశ్నిస్తున్నారు.

గుంతల రోడ్లను మరువలేదు..



వైసీపీ హయాంలో రహదారులపై మోకాలు లోతు గుంతలు పడి, వాహనదారులు నరకయాతన పడిన విషయాన్ని ఇంకా మరిచిపోలేదు. కూటమి ప్రభుత్వం ఆ గోతులను పూడ్చి ఉపశమనం కలిగించింది వాస్తవం కాదా..? అని ప్రజలు వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్నారు.



సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది కనిపించడం లేదా.? అని కూటమి నేతలు, వివిధ వర్గాల ప్రజలు నిలదీస్తున్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీ అమలౌతోందని, మెగా డీఎస్సీతో 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఈ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయనున్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే పీ-4 పథకం అమలవుతోంది.

సాగునీటికి ప్రాధాన్యం..

కరువు జిల్లాలో ప్రతి ఎకరానికీ సాగునీరు ఇవ్వాలన్న ఏకైక లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు హంద్రీనీవా ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.3,800 కోట్లు కేటాయించారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవన్నీ వైసీపీ నేతలకు కనిపించడం లేదా..? అని జిల్లా రైతాంగం ప్రశ్నిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఏనాడైనా ఒకటో తేదీ వేతనాలు ఇచ్చారా అని ఆ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తొలి నెల నుంచే ఒకటో తేదీన జీతాలు ఇస్తోందని గుర్తు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిలోపే అనేక పరిశ్రమలొచ్చాయి. ఇటీవలే బేతాపల్లిలో రూ.22 వేల కోట్లతో రెన్యూ పవర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది వాస్తవంకాదా..? రాయదుర్గం, ధర్మవరం, మడకశిర, కదిరి తదితర నియోజకవర్గాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసింది కూటమి ప్రభుత్వం కాదా..? అని వైసీపీ నేతలను ప్రజానీకం ప్రశిస్తోంది. టీడీపీ హయాంలో నెలకొల్పిన కియ పరిశ్రమతో ప్రత్యక్షంగా 10వేల మంది, పరోక్షంగా మరో 10వేల మందికి ఉద్యోగాలు లభించాయని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమను తెచ్చారా అని ప్రజలు నిలదీస్తున్నారు. పైగా జాకీ పరిశ్రమను పారిపోయేలా చేశారని మండిపడుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం నేపథ్యంలో ఆ కష్టాల నుంచి గట్టెక్కుతూ, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తూ ముందుకు సాగుతోందని అంటున్నారు. ఇలాంటి తరుణంలో ప్రజాతీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఫ్లెక్సీ రగడ



ప్రజాసంఘాల నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం సెంట్రల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భూకబ్జాదారుడని ముద్రించిన ఫ్లెక్సీ వివాదానికి తెరలేపింది. ఈ రగడకు రామ్‌నగర్‌లోని యాదవభవన్ మంగళవారం వేదికైంది. బీజేపీ నాయకులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్‌కు చెందిన భూములను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కబ్జాచేశారంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలతోపాటు వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో యాదవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా 'మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భూ కబ్జాదారుడని ముద్రించిన ఫ్లెక్సీని సమావేశ బ్యాంక్ గ్రౌండ్‌లో ప్రదర్శించారు. విషయం పల్లె అనుచరులకు తెలియడంతో వారు యాదవ భవన్‌కు చేరుకున్నారు. రెండువర్గాల మధ్య రగడ నెలకొంటున్నసమయంలో టూటౌన్ పోలీసులు అరంగ్రేటంచేసి అడ్డుకున్నారు. అనధికారికంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమనీ, ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఫ్లెక్సీని ఏర్పాటుచేయడం వివాదాలకు దారితీస్తుందని ఈ సందర్భంగా సీఐ శ్రీకాంత్ యాదవ్.. ఇరువర్గాలను హెచ్చరించారు. చట్టపరంగా వెళ్లాలనీ, శాంతిభద్రతల సమస్యలు సృష్టించవద్దని చెప్పి.. ఇరువర్గాల వారిని పోలీసులు పంపించేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి.. ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదని పల్లె రఘునాథరెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే బీజేపీ నాయకులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌కు చెందిన భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తులతో ప్రభుత్వం పట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో వ్యతిరేకత వస్తుందన్నారు. కాగా.. యాదవ భవన్‌లో పల్లె రఘునాథరెడ్డికి వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించడంతో... ఇందుకు పోటీగా ప్రెస్‌క్లబ్‌లో ఆదినారాయణ యాదవ్‌కు వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

● కలెక్టరు వినోద్‌కుమార్ హెచ్చరిక ● పింఛన్ల పంపిణీపై సమీక్ష

అనంతపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తానని, నిర్లక్ష్యం వహించినా, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పింఛన్‌ల పంపిణీకి వెళ్లినపుడు లబ్ధిదారులను గౌరవంగా పలకరించాలని సూచించారు. డబ్బులు ఇచ్చిన అనంతరం ప్రభుత్వ మెసేజ్‌లను వినిపించాలని సూచించారు. ఇళ్ల వద్దకే వెళ్లి సొమ్ము అందజేయాలని, ఎక్కడో కూర్చుని పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పనితీరును డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీపీఓ నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ అకాడమీతో అంతర్జాతీయ గుర్తింపు

● ఎంపీ బీకే పార్థసారథి ● భూముల పరిశీలన



టేకులోడు వద్ద భూములను పరిశీలిస్తున్న ఎంపీ బీకే

చిలమత్తూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో డిఫెన్స్ అకాడమీ ఏర్పాటైతే ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. మండలంలో త్వరలో ఏర్పాటుకానున్న డిఫెన్స్ అకాడమీకి సేకరిస్తున్న భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. టేకులోడు సమీపంలో పర్యటించారు. ఎంపీ మాట్లాడుతూ.. త్వరలో ఈ ప్రాంతం పారిశ్రామికవాడగా రూపుదిద్దుకుంటుందన్నారు. కుగ్రామాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతాయన్నారు. త్వరగా పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని ఎంపీని స్థానికులు కోరారు.

అక్రమార్కుడు ఆదినారాయణే..!

● ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలను వదులుకుంటా

● మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి



అనంతపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూ అక్రమార్కుడు ఆదినారాయణేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఆదినారాయణ భూ అక్రమాలపైన, తనపై చేసిన ఆరోపణల పైన సిట్టింగ్ జడ్జి లేదా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరి భూముల జోలికీ పోవాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నానని, ఏ మచ్చా లేకుండా ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు సేవ చేస్తున్నానని వివరించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎవరు కష్టాల్లో ఉన్నా ఆర్థికంగా సాయం చేస్తూ, వారి కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలో విద్యాసంస్థలను స్థాపించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించానని పేర్కొన్నారు. తనది ఒక వ్యవస్థ అని, తాను ఎంతో పద్ధతిగా ఉంటానని, ఎవరిజోలికీ పోనని అన్నారు. ఈ మధ్య గొడ్డుమర్రి ఆదినారాయణ అనే వ్యక్తి అనవసరంగా, ఆధారాలు లేకుండా తనపై అభాండాలు వేస్తున్నారని, తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది సంఘాల నాయకులకు నిజాలు చెప్పకుండా, వారిని ప్రలోభపెట్టి అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని అన్నారు. తమ గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీలో ఏడుగురు డైరెక్టరల్లో ఆదినారాయణ ఒకరని, తమ కంపెనీలో మిగతా డైరెక్టర్లకు తెలియకుండా, నిబంధనలకు విరుద్ధంగా, ఫేక్ రెజల్యూషన్ చేసి కంపెనీకి సంబంధించిన 100 ఎకరాలకు పైగా భూమిని తన భార్య, బావమరిది, మామ, అన్న పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూమిని 26 మందికి అమ్మి, వారిని కూడా మోసగించారని ఆరోపించారు. ఆదినారాయణ నుంచి తాము నష్టపోయిన భూమిని న్యాయస్థానం ద్వారా దక్కించుకుంటామని వివరించారు. ఆ భూమిలో ఒక సెంటు కాజేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లికి చెందిన 50 మందికిపైగా అమాయక గిరిజన రైతులకు సంబంధించిన 170 ఎకరాలను దౌర్జన్యంగా ఆదినారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట 1బి అడంగల్ చేయించారని, బ్యాంకుల్లో రూ.కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. అనంత లక్ష్మి కళాశాల ఎదురుగా సుమారు 50 ఎకరాల భూమిని అక్రమంగా పొందిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కియ చుట్టూ పదుల సంఖ్యలో రైతులను బెదిరించి, వారి భూములను ఆన్‌లైన్ చేసుకోలేదా అని ప్రశ్నించారు.

ఏమాత్రం బాధ్యత లేకుండా..!

(5వ పేజీ తరువాయి)

మందులను రాసి, కమీషన్ల రూపంలో వైద్యులు జేబులు నింపుకుంటున్నారు. జలుబు, దగ్గు, జ్వరంతో డాక్టర్ వద్దకు వెళితే దాదారు రూ.వెయ్యి మందులు అంటగడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

అధిక లాభాలిచ్చే మందులే విక్రయం

ప్రజలు ఆరోగ్యాన్ని పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా మెడికల్ షాపుల నిర్వాహకులు దందా సాగిస్తున్నారు. అత్యధికంగా లాభాలిచ్చే నాణ్యత లేని మందులను రోగులకు అంటగడుతున్నారు. అనుమతులు లేని మందులను సైతం విక్రయిస్తున్నారు. కార్డియాలజీ, మానసిక వ్యాధి, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్‌స్ట్రోక్, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదు. ఈవ్యాధుల ఔషధాల్లో హైడోస్, లోడోస్ అనే రకాలుంటాయి. వ్యాధి తీవ్రత, రోగి వయస్సు, శరీర తత్వం బట్టి డాక్టర్లు మందులు సిఫార్సు చేస్తారు. అయితే మెడికల్ షాపులకు వెళ్లి అడిగితే ఏరోగానికైనా ఎన్ని మందులు కావాలన్నా ఇచ్చేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొంతమంది దగ్గుకు వాడే సిరప్‌లు తాగుతున్నారు. ఇంతజరుగుతున్న సంబంధిత ఔషధ నియంత్రాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత షాపు నిర్వాహకుల నుంచి మామూళ్లు రావడమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి. అప్పుడప్పుడు తనిఖీలో చేసి, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.



వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి



వైద్యుల సలహాలు, సూచనల మేరకే మందులు వాడాలి. నేరుగా మందులు వాడితే కొన్నిమార్లు ప్రాణలమీదకు వచ్చే అవకాశముంది. సొంతగా నొప్పుల మాత్రలు, స్టెరాయిడ్స్ కొనివాడితే ఇబ్బందులు తప్పవు. అల్సర్లు ఏర్పడటమే కాకుండా, కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉంది. ప్రతి మందుకు సైడ్ ఎఫెక్టు ఉంటుంది. ఏమందు ఎవరికి పనిచేస్తుందో డాక్టర్లకు మాత్రమే తెలుస్తుంది. ఏమందులైనా డాక్టర్ల సిఫార్సు మేరకే వాడాలి. లేకుంటే శరీరంలో ఏదో ఒక భాగంపై ప్రభావం పడే అవకాశముంది.

-డాక్టర్ హుస్సేన్, జనరల్ సర్జన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కదిరి

చర్యలు తీసుకుంటాం



నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటాం. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పకుండా ఇవ్వాలి. కాలం చెల్లిన మందులు విక్రయించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవు. ఏ షాపులో మందులు కొనుగోలు చేసినా, రసీదు అడిగి తీసుకోవాలి. ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో పూర్తి పర్యవేక్షణ చేయలేకపోతున్నాం.

- రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

వన మహోత్సవానికి సహకరించాలి

సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 5న చేపట్టనున్న వనమహోత్సవాన్ని జయప్రదం చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదాబాయి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో లోపాలకు తావులేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే పంపనూరు నగరవనాన్ని డీఎఫ్ఓ శ్యామల, స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్, రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, చంద్రశేఖర్‌లతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు.

● సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న వన మహోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి శ్యామల కోరారు. జిల్లాలో 3.85 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 14 నర్సరీల్లో 12.25 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచామన్నారు. మొక్కలు కావాల్సిన వారు రేంజర్ దీప 8317572080, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున 9491835163లో సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

ఐదుగురికి తీవ్రగాయాలు


గాయపడిన కుమార్


వెంకటరమణ


ఉత్తన్న

తనకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగసానిపల్లి సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ గోపి తెలిపిన మేరకు కదిరి నుంచి మదనపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులు, లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కదిరికి చెందిన కుమార్, పూల బజార్‌కు చెందిన లక్ష్మీనారాయణ, తనకల్లు మండలంలోని పాల్యం వాండ్లపల్లికి చెందిన తుపాకుల వెంకటరమణ, అన్నమయ్యజిల్లా మొలకలచెరువు మండలం అడివినాయినచెరువుపల్లికి చెందిన గొంది ఉత్తన్న, లారీ డ్రైవర్ రామాంజనేయులు ఉన్నారు. వందేమాతం అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీడ్రైవర్ రామాంజనేయులు, గొందిపల్లి ఉత్తన్నలను మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జింకను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

యువకుడికి గాయాలు, వన్యప్రాణి మృతి


జింక కళేబరం

గుంతకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రసన్న బైక్‌పై వెళ్తూ జింకను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక భీమిరెడ్డి కాలనీకి చెందిన ప్రసన్న ఉరవకొండలో ఓ ప్రైవేటు ఐటీఐలో చదివి పాసయ్యాడు. సర్టిఫికెట్ల కోసం మంగళవారం ఉరవకొండకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డుగా జింక రావడంతో దాన్ని ఢీకొట్టి, కింద పడ్డాడు. దీంతో ప్రసన్న తలకు తీవ్ర గాయమవగా, జింక అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు 108 సర్వీసుకు సమాచారమందించగా, క్షతగాత్రుడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

చెరుకు తోట దగ్ధం... రూ.10 లక్షల నష్టం


దగ్ధమవుతున్న చెరుకుతోట

గార్లదిన్నె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదేడు గ్రామ సమీపంలో చెరుకు తోట దగ్ధమై రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన శాంతరాజు బూదేడు వద్ద ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకుని చెరుకు పంట సాగుచేశాడు. అయితే మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెరుకు తోటకు నిప్పంటుకుని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. బాధిత కౌలు రైతు శాంతరాజు నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే చెరుకు తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

నిమ్మ చెట్లు నరికి... డ్రిప్ పరికరాల దహనం


దుండగులు నరికివేసిన నిమ్మచెట్లు


కాలిపోయిన డ్రిప్పు పైపులు

యాడికి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిమానుపల్లి గ్రామంలో అన్నదమ్ములైన రైతులు శంకర్, లోకేష్‌లకు చెందిన 15నిమ్మ చెట్లు నరికివేసి, రూ.2లక్షలు విలువజేసే డ్రిప్పు పరికరాలను కాల్చివేసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. సాయంత్రం వరకు నిమ్మ తోటలో పనులు చేసి వచ్చామని బాధిత రైతులు తెలిపారు. మంగళవారం ఉదయం నిమ్మతోటలో గడ్డిమందు కొట్టడానికి వెళ్లగా చెట్లను నరికివేసి ఉన్నట్లు గమనించామన్నారు. తోటలో నిల్వ ఉంచిన డ్రిప్‌పైపులను కాల్చివేశారని తెలిపారు. మూడేళ్ల వయస్సు ఉన్న 15నిమ్మచెట్లను దుండగులు నరికివేశారని, సుమారు రూ.2లక్షలు విలువజేసే డ్రిప్ పరికరాలు కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు నేలపైన వెయిట్ అండ్ సి అని రాసి వెళ్లారని రైతులు తెలిపారు. తాము ఏ రాజకీయపార్టీకి చెందినవారు కాదని, గ్రామంలో ఎవరితో కూడా ఎటువంటి గొడవలు లేవని, దుండగులు ఎందుకు ఇలా చేశారో తెలియడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మచెట్లు నరికివేసిన సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటరమణయ్య సిబ్బందితో వెళ్లి దుండగులు నరికివేసిన నిమ్మచెట్లను కాల్చివేసిన డ్రిప్ పైపులను పరిశీలించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త

- రాబోయే మూడు నెలలు భారీ వర్షాలు కురిసే అవకాశం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు నెలల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, సహాయక చర్యలకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే త్వరగా చేపట్టాల్సిన చర్యలపై సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మూడురోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఆర్డీవోలు, వారానికి ఒకసారి డివిజన్ స్థాయిలో అధికారులతో సమీక్షించి, తగు సూచనలు చేయాలన్నారు. అలాగే జిల్లాలో చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నీటిపారుదల శాఖల ఏఈలు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిల్లో పరిశీలించాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు నీటికాలువల వ్యవస్థలను పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖాధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల ఈదురుగాలులు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, స్తంభాలు నేలకొరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, వైర్లు నేలకు వాలడం జరిగితే వెంటనే పునరుద్ధరించడానికి సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ శుభదాస్, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 2025-26కి గాను పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, ఇంటర్‌లో ఫెయిల్ అయిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 7382633687, 7702705721కు సంప్రదించాలని తెలిపారు.

ప్రవేశాలకు నేడు లాటరీ

అనంతపురం సెంట్రల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు బుధవారం లాటరీ తీయనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో మూడో తరగతినుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్లను భర్తీచేయడానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ రావడంతో లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారన్నారు. అనంతపురంలోని నవోదయ కాలనీలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల(బాలికల)లో ఉదయం 10 గంటలకు లాటరీ తీస్తామని తెలిపారు.

డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు

- వ్యవసాయ తోటలో నిల్వ
- 1500 లీటర్ల డీజిల్ పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న డీజిల్ డ్రమ్ములతో పోలీసులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు అయ్యింది. రామగిరి మండలం పెనుబోలు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ తోట కేంద్రంగా డీజిల్ అక్రమ వ్యాపారం సాగిస్తున్న వైనాన్ని పోలీసులు కనుగొన్నారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద సోమవారం రాత్రి డ్రైవర్ లారీని ఆపి నిద్రపోయాడు. తిరిగి మంగళవారం తెల్లవారు జామున లేచి గమనించగా 300లీటర్లు డీజిల్ మాయమైంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సిబ్బందితో కలిసి మండలంలోని దామాజిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో వెళ్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 90 లీటర్ల డీజిల్ దొరికింది. కారులో ఉన్న బసవరాజు అనే వ్యక్తిని విచారించగా సీకేపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ఉంచిన డీజిల్‌ను దొంగిలించానని, పెనుబోలు వద్ద రాము అనే వ్యక్తికి విక్రయించడానికి వెళ్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో పెనుబోలుకు వెళ్లి రామును తమదైన శైలిలో విచారించడంతో డీజిల్ అక్రమ వ్యాపారం బట్టబయలైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్, బిహార్‌కు చెందిన మరికొందరితో కలిసి డీజిల్ దొంగిలిస్తున్నట్లు వెల్లడైంది. పెనుబోలు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న రాము తోటలో దొంగిలించిన డీజిల్ నిల్వ ఉంచుతున్నట్లు తేలింది. దీంతో అక్కడ డ్రమ్ముల్లో ఉంచిన 1500 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రాము, అంకిత్, బసవరాజును అరెస్టు చేశారు. ఆరునెలల నుంచి జాతీయ రహదారి పక్కన ఆపి ఉన్న వాహనాల నుంచి డీజిల్‌ను దొంగిలించి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. డీజిల్‌ను 2వేల లీటర్ల వరకు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన తరువాత తాడిపత్రి, గుత్తి తదితర ప్రాంతాలలోని కొన్ని ప్రైవేటు కంపెనీలకు విక్రయించేవారని ఎస్ఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచి నట్లు ఎస్ఐ తెలిపారు. డీజిల్ దొంగతనం, అక్రమ వ్యాపారంతో సంబంధం ఉన్న ఇద్దరు బిహారీలు పరారైనట్లు తెలిసింది.

నేడు మెము రైలు ప్రారంభం

- అనంత నుంచి బెంగళూరుకు ప్రయాణం సులభతరం



అనంతపురం, న్యూటౌన్ జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి బెంగళూరు వెళ్లే మెము రైలు (66560) సర్వీసును ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైల్వే యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తి కాగానే షెడ్యూల్ టైం మేరకు మధ్యాహ్నం 2.10 అనంతపురం స్టేషన్ నుంచి రైలు బయలుదేరి రాత్రి 7.50 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరు చేరనుంది. మెమూ రైలు ప్రారంభమైతే కేవలం రూ.50తో జిల్లా కేంద్రం నుంచి బెంగళూరు చేరుకునే అవకాశం ఉంటుంది. ఇది పేద, మధ్యతరగతి ప్రయాణికులకు చాలా ప్రయోజకరంగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు సర్వీసు కోసం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అలుపెరగని ప్రయత్నం చేసి, విజయవంతం అయ్యారు. ప్రారంభోత్సవానికి ఎంపీతో పాటు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిదులు గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాతో పాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు.

బీఎస్ఎఫ్ జవాన్ మామకు భూమి అప్పగింత

- సర్వే చేయించిన రెవెన్యూ అధికారులు


భూమిని సర్వే చేస్తున్న అధికారులు

అమరాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కబ్జా చేసిన భూమిని బీఎస్ఎఫ్ జవాన్ మామ కదిరప్పకు అధికారులు మంగళవారం అప్పగించారు. మండలంలోని కే శివరం గ్రామంలో బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి మామ కదిరప్ప భూమిని అదే గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు కబ్జా చేశాడు. దీనిపై బీఎస్ఎఫ్ జవాన్ ఆవేదన వ్యక్తం చేస్తూ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో విడుదల చేశాడు. అది వైరల్ కావడంతో అధికార యంత్రాంగం శివరం గ్రామానికి పరుగులు పెట్టింది. తహసీల్దార్ లక్ష్మీనరసింహ పొలం రికార్డులను పరిశీలించారు. ఇదివరకే కోర్టు కూడా ఆ భూమి కదిరప్పకు చెందినదే అనే తీర్పు ఇచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. అప్పుడే పోలీస్ బందోబస్తు మధ్య సర్వేయర్‌ల ద్వారా కొలతలు వేసి హద్దు రాళ్లను నాటించి కదిరప్పకు భూమి అప్పగించారు. ఎన్నో సంవత్సరాల కల నేటికి నెరవేరిందని బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఆర్ఐ విన్సెంట్‌పాల్, మండల సర్వేయర్లు పుట్టరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,300 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 468టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మహాత్మా... ప్రమోషన్లు ఇప్పించు..

- గాంధీ విగ్రహానికి సంఘాల నేతల వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు వెంటనే వచ్చేలా చూడాలంటూ పలువురు అర్హులైన ఎస్‌జీటీలు గాంధీ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పలు సంఘాల నాయకులు ఆరోరోజు శారదా స్కూల్‌లో నిరసన తెలిపిన తర్వాత క్లాక్‌టవర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తర్వాత సంఘాల నేతలు మాట్లాడుతూ 2023లో తాత్కాలిక ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అలా ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులకు సంబంధించి ఖాళీలు చూపాలని కోరారు. డీఎస్సీకి 103 పోస్టులు పోగా...మిగిలిన పోస్టులు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. అర్హులైన సీనియర్ ఎస్‌జీటీలకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సూర్యుడు, చంద్రశేఖర్, జయపాల్‌నాయుడు, నరసింహులు, లింగమయ్య, రఫీ, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఎల్ఓసీ యాత్ర సభ్యులకు ఘన స్వాగతం


యాత్రలో పాల్గొన్న సభ్యులతో ఈఓఆర్డీ తదితరులు

అనంతపురంరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చలో ఎల్ఓసీ బైకు యాత్ర సభ్యులకు నగర శివారులో ఘన స్వాగతం లభించింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా కేరళకు చెందిన కొంతమంది కెప్టెన్ రాంనాథ్‌జీ నేతృత్వంలో కేరళలోని కాలాడీ ప్రాంతం నుంచి చలో ఎల్ఓసీ యాత్ర చేపట్టారు. అందులో భాగంగా ఈయాత్ర మంగళవారం మండలంలోని సోములదొడ్డికి చేరుకుంది. వీరికి ఆత్మకూరు ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు స్వాగతం పలికారు. ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో అల్పాహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం.. పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఉగ్రదాడిలో 26మంది మృతి చెందితే 26 బుల్లెట్ బైక్‌లతో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. యాత్రలో పలు చోట్ల ప్రజలు మద్దతుగా యాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈక్రమంలో 26మందితో ప్రారంభమైన యాత్ర 35మందికి చేరిందన్నారు. యాత్ర ముగిసేలోపు మరింత మంది పాల్గొనే వీలుందన్నారు. జమ్ముకశ్మీర్‌లోని శారదమఠ్ వరకు యాత్ర సాగుతుందన్నారు. అక్కడ మిలటరీ క్యాంపును చేరుకుని సైనికులను కలుసుకుని సంఘీభావం తెలియజేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి నాటక పోటీలకు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 2 నుంచి ఆరో తేదీ వరకు నిర్వహించనున్న నాటక పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైఖేల్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటకరంగ కళాకారులు అర్హులన్నారు. అనంతపురంలోని కృష్ణ కళామందిర్‌లో పౌరాణిక పద్య నాటకాలు, ఏకాంక పద్య నాటకాల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పౌరాణిక పద్య నాటకాల విభాగంలో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.70వేలు, తృతీయ స్థానానికి రూ.40వేలు నగదు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఏకాంక నాటకాల విభాగంలో మొదటి స్థానానికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానానికి రూ.10వేలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఇక పోటీల్లో స్క్రూట్నీ ద్వారా ఎంపిక చేయబడి ప్రదర్శించే పౌరాణిక పద్య నాటకానికి రూ.15వేలు, ఏకాంక నాటకానికి రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల నాటక సంస్థలు, సంఘాల వారు 63006 54184 నెంబర్‌ను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గోరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలి

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గోసంరక్షణ, వీహెచ్‌పీ నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గోరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకట రత్నమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన జిల్లా గోరక్షా ప్రముఖ్ సోమశేఖర్‌తో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోసంరక్షణ చట్టాన్ని అమలు చేశారన్నారు. రాష్ట్ర విభజనానంతరం తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఈ చట్టం అమలులో ఉందన్నారు. అయితే కొన్ని హిందూయేతర సామాజిక పండుగల సందర్భంగా గోవులను వధిస్తున్నారని, అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముస్లిం పండుగల కోసం వాహనాలలో గోవులు, ఎద్దులు, లేగదూడలను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, వాహన యజమానులకు జరిమానాలతోపాటు జైలుశిక్ష వంటి కఠిన చర్యలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని కబేళాలను మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణబాబు, కార్యదర్శి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

మారెమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు

గాండ్లపెంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుల వారిపల్లి పెద్దతండా పంచాయతీలోని కల్లుబాయితండాలో వెలసిన మారెమ్మ దేవతకు మంగళవారం ప్రజలు గ్రామస్థులు బోనాలు సమర్పించారు. కల్లుబాయి తండాలో 41రోజుల క్రితం మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మండలపూజను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు, జ్యోతులు సమర్పించారు. గ్రామస్థులతో పాటు పక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రేపు చంద్రమౌళీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం త్రిపుర సుందరీ దేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం విగ్రహప్రతిష్ఠ అనంతరం మహాకుంభాభిషేక మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అన్నదానం చేపడుతామని తెలిపా రు. మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరవుతారని వారు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించాలి: శాస్త్రవేత్తలు



తాడిమర్రిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుధీర్

తాడిమర్రి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించాలని శాస్త్రవేత్తలు సుధీర్, సుధ, ఏడీఏ క్రిష్టయ్య పేర్కొన్నారు. మండలంలోని అగ్రహారం, చిల్లకొండయ్యపల్లిల్లో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రెడ్డిపల్లి కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమైన రైతులకు పంటల ఎంపిక, విత్తనశుద్ధి, సాగులో పాటించాల్సిన మెళకువలపై వివరించారు. కార్యక్రమంలో ఏఓ రమాదేవి, హెచ్‌ఓ అమరేశ్వరి, ఏపీఎం సాంబశివుడు, సర్పంచ్ రామన్న పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: వ్యవసాయంలో మెలకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించవచ్చని శాస్త్రవేత్తలు మంజునాథ్, మాధవి, ఏడీఏ నజరుద్దీన్ పేర్కొన్నారు. వారు మంగళవారం మండలంలోని తంగేడుకుంట, అల్లాపల్లి రైతు సేవా కేంద్రాల్లో వికసిత్ కృషిసంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమలకు సంబంధించిన పథకాలు, వ్యాధులు, టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఇలియాజ్ అహమ్మద్, ఉద్యాన శాఖాధికారి లావణ్య, రైతుసేవా కేంద్రం సిబ్బంది నరేంద్ర, బాబ్‌జాన్, రైతులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు రోజల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం మున్సిపాలిటీకి నీరు సరఫరా చేసే తాగునీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 6,7 తేదీలలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పార్నపల్లి నుంచి ధర్మవరం వరకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోందని దీంతో పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. మరమ్మతుల అనంతరం 8వ తేదీ నుంచి నీటి సరఫరాను పునరుద్ధరస్తామని తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గోహత్య మహా నేరం: సీఐ

నల్లచెరువు(కదిరి), జూన్ 3(ఆంధ్రజ్యోతి): గోహత్య చేయడం మహా నేరమని సీఐ నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ముస్లిం మైనార్టీలతో ఎస్‌ఐ మగ్బుల్‌బాషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ.. ముస్లింలు త్యాగానికి ప్రతీకగా నిర్వహించే బక్రీద్ సందర్భంగా గోవులను ఖురబాని పేరుతో హత్య చేయడం నేరమన్నారు. గోవులను హత్య చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. అదే విధంగా బక్రీద్ పండుగ రోజున అలర్లు, హింసాత్మక సంఘటనలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముస్లిం మతపెద్దలు మాబూసాబ్, లతీఫ్, మౌలానా, అయ్యాత్‌ఖాన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి విషయంలో ఘర్షణ

బత్తలపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్టూరు చిన్నకొట్టాల గ్రామంలో మంగళవారం భూవివాదంలో ఘర్షణ జరిగినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. చిన్నకొట్టాలకు చెందిన గోవర్ధన్, శివయ్యకు గ్రామంలో భూమి ఉంది. వారి దాయాదులు శివయ్య, రమేష్, ఈశ్వరయ్య, శివశంకర్, బాలుకు అక్కడే భూమి ఉంది. దాయాదుల భూమిని సర్వేయర్లు మంగళవారం కొలతలు వేస్తుండగా గోవర్ధన్, శివయ్య అభ్యంతరం తెలిపారు. దీంతో సర్వేయర్లు కొలతలు వేయకుండా వెళ్లి పోయారు. కొలతలు వెస్తుంటే అడ్డు చెప్తారా అంటూ గోవర్ధన్, శివయ్యపై వారి చిన్నాన్న పెదనాన్న కుమారులు దాడిచేసి గాయపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు సేవాకేంద్రం తాళాలు ధ్వంసం



ఆర్ఎస్‌కే తాళాలు పగులకొట్టిన దృశ్యం

నంబులపూలకుంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచెలమల గ్రామంలోని రైతు సేవా కేంద్రం తాళాలను సోమవా రం రాత్రి గుర్తు తెలియని దుండగలు పగులకొట్టినట్లు ఎంపీఈఓ హరిప్రసాద్, ఏపీహెచ్‌ఏ మహబూబ్ బాషా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయి శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని కార్యాలయానికి తాళలు వేసుకుని వెళ్లారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి లోపలికి వెళ్లి మద్యం తాగి, అక్కడే మద్యం బాటిళ్ల పగలకొట్టారు. మరో గదిలో సబ్సిడీ వేరుశనగ నిలువ చేశామని, ఆ గది తాళాలు పగలకొట్టడానికి ప్రయత్ని స్తుండగా, గ్రామస్తులు అటు వైపు వెళ్తుండడం గమనించిన దుండగలు వెళ్లిపోయినట్లు ఎంపీఈఓ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

అధ్వానంగా ప్రభుత్వ వసతి గృహాలు

● శిథిలావస్థకు చేరుకున్న భవనాలు
● మౌలిక వసతులు కరువు
● మరుగుదొడ్లు ఉన్నా ప్రయోజనం శూన్యం



నల్లమాడలో శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహం

నల్లమాడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలు చాలా అధ్వానంగా మారాయి. వసతి గృహాల్లో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేశారేకానీ, అందులో ప్రయోజనం శూన్యమని తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలంలో రెండుబీసీ వసతి గృహాలు , ఎస్టీ వసతి గృహం ఉన్నాయి. ఒక బీసీ, ఒక ఎస్టీ, ఒక ఎస్సీ వసతిగృహాలు ఆరేళ్ల క్రితం మూతపడ్డాయి, నల్లమాడలోని ఎస్సీ వసతి గృహం మూత పడడంతో ఆ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారినట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. ఖాళీగా ఉన్న ఎస్టీ వసతి గృహంలో తహసీల్దార్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే దొన్నికోటలో ఉన్న బీసీ వసతి గృహం మూత పడడంతో ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నల్లమాడ, రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లిల్లో ఉన్న వసతిగృహాల్లో మౌలిక వసతులు లేకపోవడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు కురిస్తే గదులన్నీ నీరు కారుతాయి. దీంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సుదూర ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ఈ వసతి గృహాల్లో ఉండి నల్లమాడ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చదువులు కొన సాగిస్తున్నారు. ఆరేళ్ల క్రితం మూడు వసతి గృహాలను మూసివేయడంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నల్లమాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో దాదాపు 800 మంది చదువుకునే వారు. ప్రస్తుతం సగం మంది విద్యార్థులు తగ్గిపోయారు. వసతి గృహాలు మూత పడడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలంటు న్నారు. ఇదిలా ఉంటే నల్లమాడ, రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లి వసతి గృహాల్లో మౌలిక వసతులు లేకపోవడం, గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ వసతి గృహాల్లో అరకొర నీటి సదుపాయం ఉంది. మరుగుదొడ్లు వాడకంలో లేకపోవడంతో విద్యార్థులు నిత్య కృత్యాలకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మాటలతో కాలం వెల్లదీస్తోందికానీ, వసతిగృహాల్లో మౌలిక సదుపాయలు కల్పించడంలో విఫలమైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చొరవ తీసుకుని ఈ వసతి గృహాలను అధికారుల ద్వారా పరిశీలించాల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రజలు అంటున్నారు. ఆయా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రెడ్డిపల్లిలో నిరుపయోగంగా అదనపు గదులు

జగన్‌ను మించిన వెన్నుపోటుదారుడు లేడు

● ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ధ్వంసం
● నేడు నాటకాలు: పరిటాల శ్రీరామ్



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని మించిన వెన్ను పోటుదారుడు ఎవరూలేరని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొ న్నారు. వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినంపై ఆయన మండి పడ్డారు. ఆయన ముందుగా బత్తలపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా అవినీతికి తావు లేకుండా పాలన సాగుతోందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా కూలీలకు పనులు కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్లకు సూచించారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెన్నుపోటుపై మండిపాటు: వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినంపై పరిటాల శ్రీరామ్ ధ్వజమెత్తారు. సొంత బాబాయిపై గొడ్డ లి పోటు వేసి, తన కుటుంబం నుంచే జగన్ వెన్నుపోటు ప్రారంభించారని మండిపడ్డారు. సొంత చెల్లి, తల్లికి న్యాయం చేయకుండా స్వార్థం కోసం వారిని బలి పశువులను చేశాడని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి వెన్ను పోటు పొడిచి సొంత పార్టీ ఏర్పాటు చేశాడని అన్నారు. నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే, ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన జగన్‌కు ఇప్పుడు మాట్లడే అర్హత లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి... ధ్వంసం అయిన రాష్ట్రాన్ని ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం దిశగా తీసుకెళ్తున్న నాయకుడు సీఎం చంద్రబాబు అని కొనియడారు. మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారని అన్నారు. త్వరలో అన్నదాత సుకీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయణం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి: డీఐఈఓ

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని డీఐఈఓ సయ్యద్‌మౌలా అధ్యాపకులకు సూచించారు. ఆయన మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని, ఈ ఏడాదిలాగే వచ్చే ఏడాది కూడా ఉత్తీర్ణత శాతం పెంచాలని ఆయన సూచించారు. ప్రభు త్వ సంక్షేమపథకాల గురించి అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రశాంతి, వనితావాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీని తనిఖీ చేసిన డీఈఓ

నల్లమాడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని డీఈఓ కిష్టప్ప మంగళవారం తనికీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభానున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, 90శాతం చేరాయని ఇప్పటికే ఎమ్మార్సీలకు చేరాయని తెలిపారు. మిగిలిన 10శాతం పాఠశాలలు ప్రారంభంలోపే పంపుతామన్నారు. విద్యార్థులకు వాటిని అందజేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, పాఠశాలల్లో ఉపాధ్యా యుల కొరత లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఎస్‌ఏ ఏపీఓ బ్రహ్మానందరెడ్డి, సీఆర్పీ మదార్‌వలి పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం పరిహారం చెల్లించాలి'

ముదిగుబ్బ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకు జాతీయ రహదారి(342) కోసం భూములు కోల్పోయిన రైతులు తొమ్మిదోరోజు మంగళవారం కూడా పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మాటాడుతూ... రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం న్యాయమైన పరిహారం అందిస్తేనే పనులు చేయనిస్తామని తేల్చిచెప్పారు. లేకపోతే ఎన్నిరోజులైనా పనులు అడ్డుకుంటామని పేర్కొన్నారు. గ్రామసభలు నిర్వహించకుండా, రైతులకు పరిహారం ఎంత అని తెలుపకుండా పనులు చేస్తున్నారని వాపోయారు.

పాఠశాలలను పరిశుభ్రం చేసిన అధికారులు

ధర్మవరంరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ గ్రామానా మిషన్ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాన్ని మంగళవా రం నిర్వహించారు. పునః ప్రారంభంకానున్న సందర్భంగా పాఠశాలల ను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎంపీడీఓ సాయిమనోహర్ పిలుపుమేరకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో కలిసి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో చెత్తచెదారాన్ని తొలగించారు. బెంచీలను శుభ్రం చేశారు. దీంతో ఆయా గ్రామస్థులు అధికారులను అభినందిస్తున్నారు.

కాలువల ఏర్పాటుకు పరిశీలన



పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

ముదిగుబ్బ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండలంలోని చెరువులు నింపేందుకు కాలువల ఏర్పాటు కోసం అధికారులు చర్యలు చేపట్టారు. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని మండలంలోని పలువురు రైతులు పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. మండలంలోని చెరువులను నీటితో నింపితే మండల ప్రజలకు సాగు, తాగునీటిని అందించవచ్చని ఆయనకు అధికారులు తెలిపారు. అలాగే ఆయన సూచన మేరకు హంద్రీనీవా కాలువ నుంచి మండలంలోని చెరువులకు నీరు అందించేందుకు నీటిపారుదల శాఖ డీఈ మహేశ్వర్‌రెడ్డి, జేఈ బాలాజీ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, అశ్వత్థరెడ్డి, తుమ్మల మనోహర్, బాలకృష్ణ, నంద, రామాంజి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో బైక్ డ్రైవింగ్

● ద్విచక్రవాహనానికి ఢీ ● హోంగార్డుకు గాయాలు

కొత్తచెరువు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పలవాండ్లపల్లి బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు రాంప్రసాద్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. హోంగార్డు రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం పని నిమిత్తం కొత్తచెరువు నుంచి పెనుకొండకు ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. పట్టణంలోని ఓ సినిమా థియేటర్‌లో పనిచేసే ముగ్గురు యువకులు స్థానిక బండ్లపల్లిక్రాస్‌లో ఫ్లెక్సీ కట్టడానికి వెళ్లారు. మద్యం మత్తులో వారు ఆ ఫ్లెక్సీని చించివేశారు. గమనించిన స్థానికులు వారిని మందలించారు. దీంతో ఆ యువకులు మద్యం మత్తులోనే ద్విచక్రవాహనంలో వేగంగా వస్తూ హోంగార్డు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆయనకు కాలు విరిగిందని స్థానికులు తెలిపారు. గాయపడిన హోంగార్డును పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయనకు రక్తస్రావం అధికంగా అవుతుండటంతో అనంతపురానికి తరలించారు. ఇదివరకే ఆ థియేటర్‌లో పనిచేసే ఓ యువకుడు మండలకేంద్రంలోని పుట్టపర్తి రహదారిలో రామన్న అనే వ్యక్తిని బైకుతో ఢీకొనడంతో ఆయన మృతిచెందిన విషయం తెలిసిందే.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం: ఆర్డీఓ



యోగా చేస్తున్న అధికారులు

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రోజూ ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరు యోగా చేయాలని ఆర్డీఓ మహేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ప్రస్తుత పరిస్థితుల్లో శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతు న్నారన్నారు. ఇలాంటి పరిస్థితులలో యోగా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ నెల 10న ధర్మవరంలో నిర్వహించే యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి, ఇతర అదికారులు పాల్గొన్నారు.

నేడు కదిరిలో...

● కదిరిఅర్బన్: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి తూర్పు గోపురం వద్ద బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పోలప్ప మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులతోపాటు అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా ఉట్ల పరుష



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

అమడగూరు (కదిరి), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా జ్యేష్ఠమాసం మొదటి వారంలో నిర్వహించే అక్కదేవతల ఉట్ల పరుషను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని హరిపురంలో అక్కదేవతల తిరునాళ్లను నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ యేడు కూడా గ్రామస్థులు, పూజారు లు ఆంజినప్ప, చిన్నప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చివరిరోజు మంగళవారం ఉట్లమాను ఏర్పాటు చేసి ఉత్సవం నిర్వహించారు. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పరుషకు హాజరైన భక్తులు

నేటి నుంచి 'మన ఇంటికి మన ఎమ్మెల్యే'

కదిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 'మనంటికి మన ఎమ్మెల్యే' కార్యక్రమానికి బుధవారం నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ప్రతి సంవత్సరం 'మన ఇంటికి మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు. తద్వారా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటానన్నారు. తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీ సంగటవారిపల్లిలో బుధవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతామన్నారు. అనంతరం వేమలగొంది, ఎస్.వడ్డిపల్లి, కోటాల, మైరాడా, పెద్దన్నవారిపల్లి వరకు కార్యక్రమం సాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. భోనాంతరం కాలయపల్లి, చిన్నన్నవారిపల్లి, చిన్నపల్లి, ఎస్సీ కాలనీలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అధికారులతో పాటు అందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు.

విత్తన కాయలకు నమోదు చేసుకోండి: ఏఓ

బత్తలపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా వేరుశనగ సాగు చెసే రైతులు విత్తన కాయ కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం స్థానిక రైతు సేవా కేంద్రలలో సంప్రదించాలన్నారు. మండలానికి 1500 క్వింటాళ్లు కేటాయించారని తెలిపారు. 30 కిలోల బస్తా రూ.2790కాగా సబ్సిడీ పోను రైతు రూ.1674 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా మూడు బ్యాగులు ఇస్తామని ఏఓ తెలిపారు.

● నంబులపూలకుంట: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచి వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవచ్చని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలానికి 2,561 క్వింటాళ్లను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. న మోదు చేసుకున్నవారికి మాత్రమే విత్తనకాయలు అందిస్తామన్నారు.

20లోగా పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకోవాలి

నంబులపూలకుంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అర్హులైన రైతులు ఈనెల 20లోగా పండ్లమొక్కల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పార్థసారథి తెలిపారు. మండల వ్యాప్తంగా 180 ఎకరాలకు పండ్లమొక్కలు మంజూరైనట్లు తెలిపారు. సన్న,చిన్నకారు రైతులు మాత్రమే అర్హులన్నారు. రోజా, సన్నజాజి పూల పెంపకంతోపాటు, మామిడి నిమ్మ, జామ, సపోట, కొబ్బరి పంటలకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిటాల శ్రీరామ్‌కు బక్రీదుకు ఆహ్వానం

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 7న నిర్వహించే బక్రీదు పండుగకు టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌ను స్థానిక ముస్లిం మైనార్టీలు ఆహ్వానించారు. ముస్లిం మైనార్టీల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్, ముస్లీం మైనార్టీ ధర్మవరం నాయకులు మంగళవారం అనంతపురంలోని పరిటాల క్యాంప్ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి బక్రీదు పండుగ సందర్భంగా నమాజ్‌కు రావాలని వారు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ ధర్మవరం నాయకులు అత్తర్ రహీం, రాళ్లపల్లి షరీఫ్, కాలర్ బాషా, రావులచెరువు కుళ్లాయప్ప, స్టార్‌గోల్డ్ సలీంబాషా, ఖాజా, నజీర్, కాకర్ల బాషా, ఇమాం పాల్గొన్నారు.

21 తరువాత మంత్రి సత్యకుమార్ పాదయాత్ర

● మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ నెల 21 తరువాత పట్టణంలో పాద యాత్ర చేపట్టనున్నట్టు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ధర్మవరంలో పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. అయితే బుధవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో సమావేశం ఉంటుందని, ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మంత్రి పాల్గొనున్న నేపథ్యంలో పాదయాత్రను 21వ తేదీ తరువాత ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. పాదయాత్రలో మంత్రి ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగితెలుసుకుంటారన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక



బీజేపీలోకి చేరుతున్న దృశ్యం

ధర్మవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డుకు చెందిన చెన్నారెడ్డి, ఆయన మిత్ర బృందం మంగళవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 2024 జూన్ 4వ తేదీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్మోహన్‌రెడ్డి శాసనాన్ని తిరస్కరించి, నిజాయితీగల నాయకుడు మంత్రి సత్యకుమమార్‌యాదవ్‌కు విజయాన్ని ఆదరించిన రోజన్నారు. జగన్‌రెడ్డి పాలన ఒక వినాశకర అధ్యాయమన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ రూ.కోట్ల నిధులతో పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తలపెట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, నాయకులు అంబటి సతీశ్, నబీరసూల్, బిల్లే శీన తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలలో పాము కలకలం



కర్రసాయంతో పామును బయటకు పంపుతున్న దృశ్యం

సోమందేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాల లో భద్ర పరిచిన పాఠ్యపుస్తకాలను విద్యాశాఖాధికారులు వివిధ పాఠ శాలలకు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఎంఈఓలు ఆంజనేయులునాయక్, ఆనంద్‌బాబు పాఠ్యపుస్త కాలు అందిస్తుండగా ఒక్కసారిగా పాము చొరబడటంతో క లకలం రేగింది. గదిలోకి వచ్చి పాము అధికారులను హడలె త్తించింది. ప్రాణభయంతో వారు పరుగులు పెట్టారు. అక్కడే ఉన్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు పోతులమూ ర్తి చాకచక్యంగా పామును బయటకు పంపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

'ఆ స్థలం దేవదాయ శాఖది'

హిందూపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లేపాక్షి రోడ్డుకు వెళ్లే డీబీ కాలనీవద్ద ఉన్న స్థలం అనంతపద్మనాభ స్వామి ఆలయానికి సంబంధించిందని ఈట నాగేంద్రుడు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేక రులతో మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం లేపాక్షి ప్ర ధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆలయ స్థలంలో షాపులు తొ లగించడానికి మున్సిపల్ ఎక్స్‌కవేటర్ వచ్చిందన్నారు. దేవ దాయశాఖకు సంబంధించిన స్థలంలో ఉన్న షాపులను మున్సిపల్ అధికారులు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఆ భూమి 1920 నుంచే దేవాలయానికి దాతలు ఇచ్చారన్నారు. దీనిపై కోర్టులో కేసు కూడా ఉందన్నారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తప్పుడు పత్రాలతో కాజేయాలని చూస్తు న్నారని పేర్కొన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించండి

లేపాక్షి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి మలేరియా వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగా హన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారి వెంకటచిరంజీవి అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సి బ్బందికి మలేరియా నిర్మూలనపై అవగాహన నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ప్రజ లను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియాపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, ఇంటి చుట్టూ పాత టైర్లు, టెంకాయ చిప్పలు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం పుర వీధుల్లో మలేరియా నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

గోరంట్ల, జూన్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం నుంచి రైతులు విత్తన వేరుశన గ కాయలకోసం పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మునిక్రిష్ణ తెలిపారు. ఖరీఫ్‌కు సంబం ధించి మండలానికి 2,802 క్వింటాళ్ల వేరుశనగ కె-6 రకం కేటాయించారని వివరించారు. 30 కిలోల బస్తా ధర రూ. 1694 సబ్సిడీతో రైతులు కొనుగోలుచేయాలన్నారు. 50 సెంట్లకు ఒక బస్తా వంతున, ఎకరాకుపైగా ఉన్నవారికి మూడు బస్తాలు ఇస్తామన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ గోపాల్

గోరంట్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, హెల్పర్లకు మంగళవారం అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ గోపాల్, డీఆర్‌పీలు నాగరత్నమ్మ, పద్మావతి మ ధ్యాహ్న భోజనం తయారీ, వడ్డించడం గురించి వివరించా రు. భోజనం తయారు చేసే ప్రాంతం శుభ్రంగా ఉంచడంతో పాటు తాజా కూరగాయలు, ఆకుకూరలతో నాణ్యమైన పౌష్టి కాహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఏజె న్సీ నిర్వాహకులకు ఎంఈఓ బహుమతులు ప్రదానం చేసి, ప్రోత్సహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నబీరసూల్, ఫైరో జ్‌అహమ్మద్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన

రొళ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం గా చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం సూప ర్‌వైజర్ సన్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రొళ్ల మండలం కాకి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో యుక్త వయసు బాలికలకు అవగాహన క ల్పించారు. విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, జీవనోపాధి, సమానత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కార్మికుల కుటుంబికులకు ఉద్యోగం ఇవ్వాలి

హిందూపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేసి పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలలో ఒక రికి ఉద్యోగం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లా డుతూ.. మున్సిపల్ వర్కర్స్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలన్నారు. 220 మంది పీహెచ్ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్ము రూ.4.94 లక్షలు సొంత ఖాతాల్లోకి మళ్లించుకుని ఆరు నెలలుగా అధికారులు తిప్పుకుంటున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సొమ్ము కాజేసిన వారిపై చర్య లు చేపట్టాలన్నారు. మున్సిపల్ కార్మికులకు అందాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వినోద్, మారుతిరెడ్డి, ముత్యాలప్ప, చలపతి, సిద్దగిరి సురేష్, బాలాజీ, వెంకటేశ్, సమీవుల్లా, నౌషాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

సీల్డ్ కవర్లో ఎవరున్నారో..?

● పార్టీ పదవుల కోసం పలువురి దరఖాస్తు ● టీడీపీ మండల కన్వీనర్ల ఎంపికపై ఉత్కంఠ ● రేపు ప్రకటించే అవకాశం

హిందూపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నిక ల్లో భాగంగా హిందూపురం నియోజకవర్గంలోని పట్టణం, మండలాలకు సం బంధించిన పార్టీ కన్వీనర్ల మార్పునకు రంగం సిద్ధమయింది. ఇతర నియోజ కవర్గాల్లో ఇప్పటికే మండలాల కన్వీనర్లను ప్రకటించారు. ఇక్కడ ఈసారి అధిక సంఖ్యలో పోటీ పడుతున్నారు. దీంతో ఎవరిని ఎంపిక చేయాలో నియో జకవర్గ ముఖ్యనేతలకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో కన్వీనర్ల ఎంపి కను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వదిలేశారు. గతంలో ఆయా మండ లాలు, పట్టణ నాయకులు సమావేశమై కన్వీనర్‌ని ఏకగ్రీవంగా ఎంపిక చేసే వారు. ఈసారి ఎక్కువ మంది పదవులను ఆశిస్తుండటంతో ఆయా మండ లాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాలను ఏర్పాటుచేసి పేర్లను నమో దుచేసుకొని ఆ జాబితాను ఎమ్మెల్యేకు పంపారు. కన్వీనర్ పోస్టు కోసం అత్య ధికంగా చిలమత్తూరు మండలంలో 16 మంది, లేపాక్షిలో 8 మంది, హిందూ పురం రూరల్ మండలంలో 3, పట్టణంలో 7 మంది పేర్లు నమోదు చేసుకు న్నారు. వారితో పాటు మరికొంత మంది పదవులను ఆశిస్తున్నారు.

ఎంపికపై ఉత్కంఠ

హిందూపురం నియోజకవర్గంలో పార్టీ కన్వీనర్లకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రాధాన్యం కల్పిస్తారు. అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాల్లో కన్వీన ర్లకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారు. దీనికి తోడు పార్టీ అధికారంలో ఉండటం, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కావడంతో పార్టీ కన్వీనర్ అయితే నేరుగా ఎమ్మెల్యేతోనే మాట్లాడే అవకాశం ఉంటుందని, కార్యకర్తలకు మేలు చేసే అవ కాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న తరుణంలో మండల, పట్టణ కన్వీనర్లుగా ఉండేవారికి కొంత ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పుడు పార్టీ కన్వీనర్ పదవి సాధిస్తే మండల స్థాయి ప్రజాప్రతినిధులుగా అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.



తెలుగుదేశం పార్టీ కార్యాలయం

యువత వైపు మొగ్గు

ఈసారి పార్టీ పదవులను యువతకు ఇవ్వాలని ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణ చెబుతూ వస్తున్నారు. అందుకు అనుగుణంగానే కన్వీనర్ల పేర్లు ఉంటా యని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. మూడు మండలాలు, పట్టణానికి సం బంధించి యువతకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ స మాచారం. రాబోయే సంవత్సరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పార్టీని మరింత పటిష్టం చేయాలన్న ఉద్దేశ్యంతో కసరత్తు చేస్తున్నారు.

రేపు ప్రకటించే అవకాశం

పట్టణ, మండల కన్వీనర్ల ఎంపిక ఎప్పుడు జరుగుతుందా అని ఏడాదిగా ఎ దురుచూస్తున్న నాయకులు, కార్యకర్తలకు గురువారం తెరపడనుంది. ఎమ్మెల్యే బాలకృష్ణ సీల్డ్ కవర్‌ను పంపనున్నట్లు పార్టీ ముఖ్యనేతల ద్వారా తెలిసింది. అదే రోజు పేర్లు ప్రకటించే అవకాశం ఉందని నాయకులు అంటున్నారు.

ఉపాధి పనుల తనిఖీ

- టెక్నికల్ అసిస్టెంట్, కూలీల గొడవపై ఎంపీడీఓ విచారణ

సోమందేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లిలో చేస్తున్న ఉ పాధి పనులను మంగళవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మి తనిఖీ చేశారు. శనివా రం ఉపాధికూలీలకు, టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్‌కు మధ్య జరిగిన వాగ్వాదంపై ఆమె విచారణ చేపట్టారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి గొడవకు గల కారణాలపై ఆరాతీశారు. కొలతల్లో తేడాలతో కూలి తక్కువగా వస్తోందని, దీంతో కొలతలు తీయడానికి ఒప్పుకోలేదని కూలీలు అన్నారు. ఈ విషయమై టెక్నికల్ అసిస్టెంట్‌తో వాగ్వాదం చోటుచేసుకుందన్నారు. ఎంపీడీఓ మాట్లాడు తూ.. మ్యానువల్‌గా బిల్లులు పెట్టే పరిస్థితి లేదన్నారు. మార్చి నెల యాప్ ద్వారా పని వివరాలు, కూలీల సంఖ్యను నమోదు చేస్తున్నందున తప్పనిసరి కొలతలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మీరు ఎంత పనిచేస్తే అంతే కూలీ పడుతుందని వివరించారు. ఇకపై పది మందిని కలిసి గ్రూపుగా చేసి పనులు కల్పిస్తామని తెలిపారు. ఉపాధి పనులకు వచ్చేవారు స్వయంగా మస్టర్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పనులు చేసిన అనంతరం యాప్ ద్వారా ఫొటోలు దిగాలన్నారు. గతంలో మాదిరి నీరు, మజ్జిగ, గడ్డపార పదును, ఇతరా అలవెన్సులు ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పథకం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లిందని వివరించారు. సమస్య ఏదైనా ఉంటే నేరుగా తమదృష్టికి తీసుకురావాలని, గొడవకు దిగడం సరికా



గొడవపై విచారణ చేస్తున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మి

దని సూచించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఉన్న మస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎప్పటికప్పుడు యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ కిషోర్‌ను ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమ యితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్ రెడ్డి, ఈసీ అన్నపూర్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కమిషనర్



పెనుకొండలో యోగా పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువత

పెనుకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో మారుతున్న జీవన విధానంలో ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయడం అలవర్చుకుని ఆరోగ్యవం తులు కావాలని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. మంగ ళవారం స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జూనియర్, సీనియర్ 19-35 సంవత్సరాలు వారికి యోగా పోటీ లు నిర్వహించారు. మొదటి రోజు 10నుంచి 18సంవత్సరాల యువతీ యువకు లకు సోలో యోగా, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్‌పై పో టీలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ వెంకటరమణ, ఆర్ఓ దినేష్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

● హిందూపురం(రొద్దం): ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన యోగాం ధ్రపై రొద్దంలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మంగళవారం రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులకు యోగా పోటీ లు నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి ప్రభుత్వం నిర్వహించే యోగాడేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాంకుమార్ కోరారు.

● గోరంట్ల : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల స్థాయి యో గా పోటీలు మంగళవారం ప్రారంభించారు. మండలంలోని పంచాయతీల వివి ధ స్థాయిలో మూడు కేటగిరుల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీడీఓ నరేంద్రకు మార్, యోగా మాస్టర్ భక్తవత్సలం ఆధ్వర్యంలో ఆసనాలు, సూర్యనమస్కారా లు, ప్రాణాయమం, ధ్యానంపై పోటీలు నిర్వహించారు. 24 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే యోగాంధ్రలో పాల్గొన్నడానికి అర్హులుగా ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఉన్న తపాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా జనసేన



మృతుడి చిత్రపటం, చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

హిందూపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఉండే జనసైనికు ల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకుల ఉమేష్ అన్నారు. చిలమత్తూరు మండలం మొరంపల్లికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందా డు. కార్యకర్తకు క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో అతడి కుటుంబాని కి ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా రూ.5లక్షల ప్రమాద బీమా చె క్కును మంగళగిరి పార్టీకార్యాలయంలో అందజేసినట్లు ఆకుల ఉమేష్ తెలిపారు. ఏ సమస్య వచ్చినా పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుంద న్నారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా పార్టీ అధ్యక్షుడు, అహుడా చైర్మన్ వరుణ్, చిలమత్తూరు మండల కన్వీనర్ చిన్నప్రవీణ్ పాల్గొన్నారు.

సమయానికి సరుకులు అందించాలి

రొళ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు డీలర్లు ప్రతి నెల 1నుంచి 15వ తేదీ వ రకు ప్రజలకు అందుబాటు లో ఉండి సరుకులు అం దించా లని తహసీల్దార్ షె క్షావలి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని భద్రేపల్లి ఎఫ్‌పీ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం స్టాకును పరిశీలించారు. పనివేళల్లో సరుకులు అందించా లన్నారు. ఆయన వెంట ఆర్ఐ గిరియప్ప ఉన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

రేషన్ పంపిణీలో నొక్కుడు

● డీలర్ల ఇష్టారాజ్యం ● తూకాల్లో భారీ మోసం ● పట్టించుకోని అధికారులు

పెనుకొండటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో స్టోర్ డీలర్ల తీరు మారడంలేదు. గత వైసీపీ పాల నలో రేషన్ పంపిణీలో వేయింగ్ మిషన్లపై గోనెసంచులు వేసి బియ్యం పంపిణీ చేసి నొక్కేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పాత డీ లర్లను తప్పించి కొత్త డీలర్లను నియమించింది. వీరు ఏకంగా పెద్ద ప్లాస్టిక్ డబ్బా పెట్టి రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్క కార్డుదారుడితో కిలో నుంచి రెండు కిలోల చొప్పున తూకాల్లో నొక్కేస్తున్నారు. ప్రతి కార్డుదారుడు నష్టపోతున్నాడు. ప్రశ్నిస్తే ఇష్టమొచ్చినచోట చెప్పుకోమని డీలర్లు బెదిరిస్తున్నా రు. రేషన్‌కార్డులు తొలగిస్తారేమోనని పేదలు భయపడి మిన్నకుంటున్నారు.

ప్లాస్టిక్ డబ్బా 840 గ్రాములు

వేయింగ్ మిషన్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేయాలంటే కార్డుదారుడు తీసుకొచ్చిన సంచుల్లో బియ్యంవేసి వారికి వచ్చే కోటా అందించాలి. అలా కా కుండా ప్లాస్టిక్ బకెట్లో బియ్యం వేసి దాదాపు కిలో నుంచి ఒకటిన్నర కిలో వరకూ తక్కువ తూకాలు వేసి బియ్యం వేస్తున్నారు.

స్టాక్ పాయింట్‌లోనే నొక్కుడు

పెనుకొండ స్టాక్ పాయింట్ నుంచి అసలు సమస్య మొదలవుతోంది. నియోజకవర్గ పరిధిలోని పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి డీలర్లకు బియ్యం సరఫరా చేస్తారు. పెనుకొండ మండలంలో 16,500 కార్డులకు 150 టన్నుల 950 కిలోల బియ్యం, సోమందేపల్లి మండలంలో 10,941 కార్డులకు 103 టన్నుల 741 కిలోలు, రొద్దం మండలంలో 14,820 కార్డులకు 124 టన్నుల 825 కిలోల బియ్యం ప్రతినెలా సరఫరా చేస్తారు. స్టాక్‌పాయింట్ నుంచి తూకాల్లో తక్కువగా వస్తాయని, అందుకే తాము కార్డుదారుడికి తక్కువ తూకాలు వేస్తున్నామని సమర్థించుకుంటున్నారు.

కనిపించని పర్యవేక్షణ

ఈనెల 1న మంత్రి సవిత, కలెక్టర్ చేతన్ పెనుకొండలో నూతన రేషన్ షాపులు ప్రారంభించారు. కార్డుదారులకు తూకాలు సక్రమంగా వేయాలని ఆదేశించారు. వారి మాటను పెడచెవిన పెట్టారు. రెవెన్యూ అధికారుల పర్య వేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికైనా సరైన తూకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కార్డుదారుడు తీసుకొచ్చిన సంచిపెట్టే రేషన్ బియ్యం అందించాలి. అలాకా కుండా వేయింగ్ స్కేల్‌పై గోనెసంచె, డబ్బాలు ఉంచి తూకం వేస్తే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్తాం. చట్ట ప్రకారం చర్యలు చేపడతాం.

-ప్రభావతి, సీఎస్‌డీటీ



కురుబవాండ్లపల్లి రేషన్ షాపులో ప్లాస్టిక్ డబ్బాతో బియ్యం వేస్తున్న డీలర్, 840 గ్రాముల తూకం ఉన్న ప్లాస్టిక్ డబ్బా, చంద్రగిరిలో డబ్బా దాచిపెడుతున్న దృశ్యం

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంపీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బీకే పార్థసారథి

పెనుకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం లో అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం ఎంపీ పార్థసారథి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల్లో నెలకొన్న, వ్యక్తిగత సమస్యలను పార్టీ కార్యకర్తలు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి ప నుల గురించి పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో నాయకులు గుట్టూరు సుబ్బరాయుడు, నాగరాజు, ప్రసాద్, వీజీపాళ్యం శీనా, ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనుమ మారెమ్మ జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మడకశిర రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపల్లికి చెందిన ప్రజలు మంగళవారం కనుమమారెమ్మకు జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే గ్రామస్థులు జ్యోతులు త యారు చేసుకుని వాటిని ఊరేగింపుగా తీసుకుని ఆమిదాలగొంది సమీ పంలో కనుమలో ఉన్న అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బా గా పండాలని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కబడ్డీ పోటీల్లో గుబ్బి విద్యార్థుల విజయం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

పావగడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కురుబవాండ్లపల్లి గేట్‌లో ఉ న్న డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో గుబ్బి డిగ్రీ కళాశాల బాలికలు మొదటి బహుమతి గెలుచుకున్నారు. తుమకూరు జిల్లాలోని గుబ్బి, కొరటగెరె, కునిగల్, తిప్పటూరు, తుమకూరు, పావగ డ మొత్తం 11 జట్లు కబడ్డీ ఆటల్లో తలపడ్డాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన ఆటల పోటీల్లో గుబ్బి బాలికలు విన్నర్‌గా, కునిగల్ బాలికలు రన్నర్‌గా నిలిచినట్లు న్యాయ మూర్తులు ప్రకటించారు. బెస్ట్ రైడర్‌గా గుబ్బి కళాశాలకు చెందిన అనూష, బెస్ట్ క్యాచర్‌గా కునిగల్ తాలూకాకు చెందిన వినూత ఎంపిక య్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివానందయ్య, మారప్ప, అధ్యాప కులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తుమ్మల మారెమ్మ

గుడిబండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన గుడిబం డలో వెలిసిన తుమ్మల మా రెమ్మ అమ్మవారికి భక్తులు ప్ర త్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని ప్ర త్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఎస్ గుండ్లు గ్రామానికి చెందిన సుబ్బన్న పుట్టలింగప్ప తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం కర్ణాటక ప్రాంతంలోని పుర్లహళ్లి గ్రామంలో వెలిసిన బూతప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

అగళికి చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పంపిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు, సిబ్బంది

అగళి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల విద్యా ర్థులకు మంగళవారం 19,138 నోటుపుస్తకాలు, 14,340 పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్ నుంచి సరఫరా అయినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నా యుడు తెలిపారు. 95 శాతం కిట్స్, పుస్తకాలు మండలానికి చేరాయ న్నారు. 1459 బాలుర బూట్లు, 1578 మంది బాలికల బూట్లు ఎంఈఓ కార్యాలయానికి చేరినట్లు తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు 700 డిక్షనరీలు వచ్చాయని, వాటిని చేరుస్తామని ఎంఈఓ తెలిపారు.

డ్వాక్రా సభ్యులకు కుర్చీలు, టేబుళ్ల వితరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ సోమప్ప

పరిగి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డ్వాక్రా మహిళా సంఘాలకు మాజీ ఎంపీటీసీ సోమప్ప 20 కుర్చీలు, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి 20 కుర్చీలు, టేబుళ్లు వితరణ చేశారు. దాతలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల క న్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, నాగరాజు, ఏపీఎం రామేశ్వర్ రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సిద్దమ్మ, ఉపాధ్య క్షురాలు శృతి, వీవో రామాంజినమ్మ, శిరీష, నాగరత్నమ్మ, కల్పన, సువర్ణ, ఈశ్వరమ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.